


రంగారెడ్డి జిల్లా తులేకలాన్ గ్రామంలో జెండాకు రంగు అద్దుతున్న బీఆర్ఎస్ కార్యకర్త


నమస్తే తెలంగాణ

వికారాబాద్

హైదరాబాద్, శనివారం 26 ఏప్రిల్ 2025 | VIKARABAD

మాజీ మంత్రి సబితారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన రావులపల్లి యువకులు

# గులాబీ పండుగకు సిద్ధం

## ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పార్టీ రజతోత్సవ వేడుకలకు ముస్తాబవుతున్న గ్రామాలు

- ఈ నెల 27న వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు
- ఇప్పటికే పార్టీ జెండాలు అందజేత
- జెండా దిమ్మెలకు రంగులు.. గులాబీ తోరణాలతో అలంకరణ





ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన వాహనాలను నిలిపేందుకు పార్టీ విడుదల చేసిన రూట్ మ్యాప్



కొండాపూర్ మసీదుబండలో రజతోత్సవం సందర్భంగా గులాబీ రంగులో సిద్ధమైన కార్లు

రంగారెడ్డి, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ)/పరిగి : బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకలకు ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని గ్రామాలు ముస్తాబవుతున్నాయి. తెలంగాణ ఇంటి పార్టీ బీఆర్ఎస్ ఆవిర్భవించి 25 ఏండ్లు అవుతున్న సందర్భంలో ఊరూరా గులాబీ పండుగ నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు జరుగుతున్నాయి. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో పార్టీ ఆవిర్భావం సందర్భంగా ఈ నెల 27వ తేదీ ఉదయం వేడుకలు నిర్వహించేందుకు బీఆర్ఎస్ శ్రేణులు ఏర్పాట్లు చేశాయి. పార్టీ ఏర్పడిన తర్వాత 14 ఏండ్లు ఉద్యమాన్ని ఉరకలెత్తించి తెలంగాణ సాధించడం, సబ్బండ వర్గాలను ఏకం చేసిన పార్టీ దశాబ్దకాలం అధికారంలో ఉండి ప్రతి గ్రామాభివృద్ధికి, ప్రతి వర్గం సంక్షేమానికి ఎంతో కృషి చేసింది. పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు వరంగల్‌లో జరుగనున్న రజతోత్సవ బహిరంగ సభకు తరలివెళ్లే ముందు రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని ప్రతి గ్రామం, పట్టణంలోని ప్రతి వార్డులోనూ గులాబీ జెండా పండుగను అట్టహాసంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల్లోని అన్ని నియోజకవర్గాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించి రజతోత్సవ సంబురానికి పార్టీ కేడర్‌ను సన్నద్ధం చేశారు. ఇందులో భాగంగా జెండా దిమ్మెలకు రంగులు వేయడం, చుట్టుపక్కల గులాబీ తోరణాలతో అలంకరణ చేపట్టే పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో జెండాదిమ్మెలకు రంగులు వేయగా మిగతా గ్రామాల్లో శనివారం సాయంత్రం లోపు పూర్తి కానున్నది. ఇప్పటికే పార్టీ ఆధ్వర్యంలో ప్రతి గ్రామానికీ పార్టీ జెండాలను అందజేశారు. రజతోత్సవ సంబురం అదిరిపోయేలా నిర్వహించడం ద్వారా అధికార పార్టీ వెన్నులో వణుకు పుట్టించాలన్నది గులాబీ దళం ఆలోచన. ఇప్పటికే గ్రామాల్లో వాల్‌రైటింగ్ పూర్తైంది. పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికెళ్లి రజతోత్సవానికి భారీగా తరలివెళ్లి సక్సెస్ చేద్దామని ప్రజలను కోరుతున్నారు. రంగారెడ్డి జిల్లా నుంచి బహిరంగ సభకు సుమారు లక్ష మందిని తరలించాలని మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డి, పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నిర్ణయించి అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా వికారాబాద్ జిల్లా నుంచి కూడా భారీగా తరలివెళ్లేందుకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆనంద్ ప్రత్యేక చొరవ చూపుతున్నారు. 16 నెలల కాలంలోనే అధికార పార్టీపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిన నేపథ్యంలో, కేసీఆర్ పాలనే బాగుండేదని ముక్తకంఠంతో పేర్కొంటున్న ప్రజలు సైతం స్వచ్ఛందంగా బీఆర్ఎస్ రజతోత్సవంలో పాలుపంచుకోనున్నారు.

### పోస్టర్లు, ఫ్లెక్సీల హోరు




భారత రాష్ట్ర సమితి 25 ఏండ్ల పండుగ సందర్భంగా ఈ నెల 27న ఏర్పాటు చేసే భారీ బహిరంగ సభకు గ్రేటర్ శ్రేణులు కదులుతున్నారు. ఇప్పటికే చాలామంది నేతలు ఎల్కతుర్తి సభ ఏర్పాట్లను పరిశీలించి వచ్చారు. నియోజకవర్గాలను గులాబీ మయం చేయడంతోపాటు పెద్ద ఎత్తున వాల్ పెయింటింగ్ రాయించారు. పలు ప్రాంతాల్లో పోస్టర్లు అంటించారు. ఎక్కడ చూసినా 'కేసీఆర్ జిందాబాద్' 'కేసీఆర్ నాయకత్వం వర్ధిల్లాలి' 'చలో వరంగల్' 25 ఏండ్ల పండుగను జయప్రదం చేయండి అన్న కొటేషన్లు దర్శనమిస్తున్నాయి.. వీటితోపాటు డివిజన్లు అన్ని గులాబీమయం కావడంతో ప్రతి ఒక్కరినీ ఉత్సాహపరుస్తున్నాయి.

# ఊరూవాడా వరంగల్ బాట పట్టాలి

- రేపటి రజతోత్సవాన్ని సక్సెస్ చేయాలి
- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- మాజీ మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

చేవెళ్ల రూరల్, ఏప్రిల్ 25 : ఊరూవాడా.. వరంగల్ బాట పట్టాలని.. రేపటి రజతోత్సవ మహాసభను సక్సెస్ చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి గులాబీ జెండానే శ్రీరామ రక్ష అని స్పష్టం చేశారు. మండలంలోని రావులపల్లి గ్రామానికి చెందిన పలు పార్టీలకు చెందిన దాదాపు 25 మంది యువకులు డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రాజేంద్రనగర్ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి, సబితారెడ్డి సమక్షంలో శుక్రవారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో పదేండ్లపాటు రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోయిందని.. గత 16 నెలలుగా కాంగ్రెస్ పాలనలో తెలంగాణ అట్టడుగుకు చేరిందని మండిపడ్డారు. పార్టీ కోసం పని చేసే ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో తగిన గుర్తింపు లభిస్తుందని హామీ ఇచ్చారు.

రేపు వరంగల్‌లో జరుగనున్న పార్టీ రజతోత్సవ మహాసభకు నియోజకవర్గం నుంచి ప్రజలు, అభిమానులు, శ్రేణులు భారీగా తరలివెళ్లి సక్సెస్ చేద్దామని పిలుపునిచ్చారు. కా గా, పార్టీలో చేరిన నందు, శ్రీకాంత్, కుమార్, రమేశ్, శ్రీనివాస్, లక్ష్మీకుమార్, గణేశ్, సురేశ్, గడ్డమీది కుమార్, సురేశ్, మధుసూదన్‌గౌడ్, సుధాకర్, రాము, హరికృష్ణలు ఉన్నారు. కార్యక్రమంలో కమ్మెట మాజీ సర్పంచ్ హన్మంత్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గోనె కరుణాకర్‌రెడ్డి, గోనె రాహుల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, చాకలి వెంకటేశ్ పాల్గొన్నారు.



కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్

# హామీల అమల్లో సర్కార్ విఫలం

- రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారింది
- బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు ఆనంద్
- బీఎస్పీ, కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిక

బంట్వారం, ఏప్రిల్ 25 : రాష్ట్రంలో పాలన అస్తవ్యస్తంగా మారిందని.. అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని బీఆర్ఎస్ పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. శుక్రవారం మండలంలోని సల్బత్తాపూర్, మద్వపూర్ గ్రామాలకు చెందిన బీఎస్పీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు ఆనంద్, అభిలాశ్, మల్లయ్య, శ్రీశైలం, అజయ్, మహేందర్ తదితరులు మాజీ ఎమ్మెల్యే ఆనంద్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేండ్ల కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారని..16 నెలల కిందట వచ్చిన కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోతున్నారని.. ఇచ్చిన ఒక్క హామీకూడా సక్రమంగా అమలు కాలేదని మండిపడ్డారు. హామీల అమల్లో సర్కార్ పూర్తిగా విఫలమైదన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మల్లేశం, కార్య నిర్వాహక అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు అశోక్, నాయకులు గోరేమీయా, నర్సింహులు, వీరేశం, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

# బైకుపై నలుగురు విద్యార్థులు

## వాహనాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

మన్సూరాబాద్ : నలుగురు విద్యార్థులు ఓ బైక్‌పై ప్రమాదకరంగా ప్రయాణిస్తుండగా ఆ వాహనాన్ని ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీసులు పట్టుకున్నారు. ఎల్బీనగర్ ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. శుక్రవారం ఎల్బీనగర్ ఫ్లైఓవర్ వద్ద ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్న సమయంలో ఒకే బైకుపై నలుగురు వాసవి కాలేజీకి చెందిన విద్యార్థులు వెళ్తూ ట్రాఫిక్ పోలీసుల కంటబడ్డారు. బీటెక్ మూడో సంవత్సరం విద్యార్థి తరుణ్ బైక్ నడుపుతుండగా అతడి ముగ్గురు మిత్రులు వెనుక కూర్చున్నారు. హీరోహోండా ఫ్యాషన్ బైక్‌పై హెల్మెట్ కూడా ధరించకుండా ఎల్బీనగర్ నుంచి చింతలకుంట వైపు ప్రమాదకరంగా వెళ్తున్న వారిని పట్టుకుని బైకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సదరు బైకుపై 2014 నుంచి ఇప్పటివరకు 21 చలాన్లు.. రూ.9860 జరిమానాలు పెండింగ్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. తల్లిదండ్రులను ఎల్బీనగర్ ఠాణాకు కౌన్సెలింగ్ నిమిత్తం హాజరు కావాలని పోలీసులు సూచించారు.

# నగరంలో పాకిస్థానీయులు

- నగరంలో కట్టుదిట్టమైన పోలీసు భద్రత
- పాకిస్థానీయుల వివరాలపై కేంద్రం ఆరా
- వెనక్కి పంపాలంటూ హోం మంత్రి అమిత్‌షా ఆదేశాలు
- సిటీలో పోలీసుల స్పెషల్ వెరిఫికేషన్ డ్రైవ్
- గడువు ముగిసిన తర్వాత ఉంటే కఠిన చర్యలు తప్పవంటున్న పోలీసులు

వివరాలు IVవ పేజీలో..



మోమిన్‌పేటలో కురుస్తున్న భారీ వర్షం

# సుద్ధ అక్రమ తవ్వకాలు నిజమే..

## తేల్చి చెప్పిన రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు



విచారణ జరుపుతున్న రెవెన్యూ, మైనింగ్ శాఖల అధికారులు

పెద్దేముల్, ఏప్రిల్ 25 : మండలంలోని తింసాన్‌పల్లి గ్రామంలో అక్రమ తవ్వకాలు జరిగినట్టు పలు పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంతో మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు శుక్రవారం సంయుక్తంగా సర్వే చేశారు. ఈ సర్వేలో సుద్ధ అక్రమ మైనింగ్ జరిగింది వాస్తవమేనని వారు తేల్చారు. సుమారు 4300 టన్నుల వరకు సుద్ధను తవ్వినట్లు గుర్తించారు. తవ్వి న సుద్ధను పక్క పొలం యజమాని అనితారెడ్డి, రాఘవేందర్ పొలాల్లో ఆరబెట్టారు. ఈ మేరకు తవ్వకాలు జరిపిన వ్యక్తికి తవ్వకాలపై సాధారణంగా రూ. 8,42,925 పన్నులు ఉండగా అంతకు పదిరేట్లు జరిమానా విధించడం జరుగుతుంద ని, దానితోపాటు 30శాతం డీఎంఎఫ్‌టీ, 80 శాతం ఎఫ్‌డబ్ల్యూ, 2 శాతం ఐటీ, 2 శాతం ఎస్ఎంఈటీ అదనంగా విధించే అవకాశం ఉన్నట్లు వారు తెలిపారు. ఈ నివేదికను వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్, సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు అందిస్తామన్నా రు. సుద్ధ గనుల్లో ఎవరైనా అక్రమంగా మైనింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తాండూరు మైనింగ్ ఏడీ సత్యనారాయణ, మైన్స్ ఆర్ఐ, రెవెన్యూ ఆర్ఐ , సర్వేయర్లు పాల్గొన్నారు.

# ఉదయం ఎండ.. సాయంత్రం వాన

## వికారాబాద్ జిల్లాలో గత నాలుగు రోజులుగా వింత వాతావరణం

వికారాబాద్, ఏప్రిల్ 25 : వికారాబాద్ జిల్లాలో విభిన్న వాతావరణం నెలకొన్నది. ఉదయం వేళలో ఎండ దంచికొడుతుండగా.. సాయంత్రం సమయంలో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులొచ్చి నల్లమబ్బులు కమ్ముకుని వర్షం కురుస్తున్నది. గత నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నది. శుక్రవారం సాయంత్రం వికారాబాద్ జిల్లా కేంద్రం, మోమిన్‌పేట మండలంతోపాటు పలు గ్రామాల్లో చిరుజల్లులతో ప్రారంభమై మోస్తరు వర్షం కురిసింది. మోమిన్‌పేట నుంచి వికారాబాద్ వెళ్లే రహదారి పక్క ఉన్న పెద్ద చెట్టు విరిగి రోడ్డుపై పడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. అదేవిధంగా ఈదురు గాలులకు చెట్లు నేలకూలడంతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. స్థానికులు, పోలీసులు కలిసి రోడ్డుపై పడిన చెట్టును తొలగించడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా, శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ దంచికొట్టడంతో వాహనదారులు, పాదచారులు, వివిధ పనులు చేసుకునే కూలీలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఎండ నుంచి ఉపశమనం కోసం శీతల పానీయాలు తాగారు.




ఎండ నుంచి ఉపశమనం కోసం శీతల పానీయాలు తాగుతున్న పట్టణవాసులు



రోడ్డుపై విరిగి పడ్డ పెద్ద చెట్టు

# డాటా ఎంట్రీ ఆపరేటర్లకు డబ్బు లెప్పుడిస్తారు..?

- ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి ఐదు నెలలు దాటినా అందని వైనం
- వికారాబాద్ జిల్లాలో 2,91,046 కుటుంబాల సర్వే వివరాలు ఆన్‌లైన్‌లో..
- వారికి రావాల్సిన మొత్తం రూ.87.31లక్షలు
- రాష్ట్రంలోని ఆరేడు జిల్లాలకు ఇచ్చి.. మాకెందుకు ఇవ్వరని ఆవేదన



పరిగి, ఏప్రిల్ 25 : కాంగ్రెస్ సర్కారు చెప్పేదొకటి, చేసేదొకటి అన్నట్లుగా మారింది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే(సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే) చేపట్టి ఐదు నెలలు పూర్తవుతున్నది. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలోనే ఈ కుల గణన చేపట్టామని, ఈ సర్వే ఆధారంగానే అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతాయంటూ బీరాలు పలికిన సర్కారు సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇప్పటికీ డబ్బులు ఇవ్వకపోవడం గమనార్హం. సర్వే తామే చేపట్టామంటూ గొప్పలు చెప్పుకోవడం తప్ప డబ్బులు ఇవ్వడంలో ఇంత అలసత్వం ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. నవంబర్ 9వ తేదీ నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రారంభించి నెలాఖరు వరకు పూర్తి చేశారు. ఇందుకోసం ఉపాధ్యాయులు తమకు కేటాయించిన ఇంటింటికెళ్లి ఆయా కుటుంబాలకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించారు. ఇక్కడివరకు అంతా బాగున్నది. కానీ, నవంబర్ 25 నుంచి డిసెంబర్ 5 వరకు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం పూర్తి చేయించారు. వికారాబాద్ జిల్లాలోని 20 మండలాల్లోని ప్రతి గ్రామం, నాలుగు మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 2,91,046 కుటుంబాలకు సంబంధించిన సమగ్ర సర్వే పూర్తి చేశారు. ఆ వివరాలను ఆయా మండలాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ కళాశాలల్లో కంప్యూటర్లు ఉన్న దగ్గర ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయించారు.

### ఎన్యూమరేటర్లకు ఇచ్చి..

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇప్పటికీ డబ్బులు అందలేదు. సర్వే చేపట్టిన ఎన్యూమరేటర్లకు రెమ్యూనరేషన్ ఇవ్వగా డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఇవ్వకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒక్కో కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసినందుకు రూ.30 చెల్లిస్తామని అధికారులు చెప్పారు. దీంతో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే డాటా ఎంట్రీ ఆపరేటర్లు, ప్రైవేట్ వారు, నిరుద్యోగులు ఇలా అనేక మంది తమకు ఎంతోకొంత డబ్బులొస్తాయనే ఆశతో సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో రాత్రనక, పగలనక కష్టపడి పూర్తి చేశారు. రంగారెడ్డి జిల్లా పరిధిలోని కొందుర్గు మండలానికి సంబంధించి సర్వే వివరాలను సైతం పరిగిలోని ఓ కళాశాలలో ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయించారు. జిల్లాలోని 2,91,046 కుటుంబాల సర్వేవివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. అధికారులు చెప్పిన లెక్కల ప్రకారం జిల్లాలోని డాటా ఎంట్రీ ఆపరేటర్లకు రూ. 87. 31లక్షలు రావాల్సి ఉన్నది. డాటా ఎంట్రీ పూర్తి కాగానే వారం రోజుల్లోపే మీకు డబ్బులు అందుతాయని అప్పట్లో అధికారులు చెప్పారని.. ప్రస్తుతం డబ్బుల విషయం అడిగితే వచ్చినప్పుడు ఇస్తామంటూ చెబుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందుర్గు మండలానికి సంబంధించిన డబ్బుల విషయం అడిగితే మాకు డబ్బులు రాలేదు, కలెక్టర్‌ను అడగండంటూ ఓ అధికారిణి పరుషంగా మాట్లాడుతున్నారని పేర్కొంటున్నారు. కొందరు నిరుద్యోగులు డబ్బుల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు.

ఈ విషయమై జిల్లా అధికారులను అడుగగా అన్ని బిల్లులు ప్రభుత్వానికి పంపించామని, త్వరలోనే వస్తాయని చెప్ప డం గమనార్హం. ఇదిలావుండగా రాష్ట్రంలోని ఆరేడు జిల్లాలకు చెందిన డాటా ఎంట్రీ ఆపరేటర్ల డబ్బులు అందాయని.. మిగతా జిల్లాలకు కూడా వస్తాయని అధికారులు పేర్కొంటున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లా వికారాబాద్‌కు ఏదైనా ముందు వరుసలో రా వాల్సి ఉండగా ఇప్పటికీ డాటా ఎంట్రీ ఆపరేటర్లకు ఐదు నెలలు దాటినా డబ్బులు రాకపోవడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. త్వరగా తమకు డబ్బులు ఇవ్వాలని డాటా ఎంట్రీ ఆపరేటర్లు కోరుతున్నారు.